వియోగయోగము

రాగ విరాగమ్ములు మఱి
యోగ వియోగములు నొదవు యోగార్ధముగన్
యోగార్ధమ్మె సమస్తము
యోగార్ధము సంస్మరింతు యోగేశ హరిన్

ఓగేటి పశుపతి
విద్యాక్షేత్రం
యూజలి

మొదటి ముద్రణ : 1999 జనవరి

ప్రతులు : 500

అమూల్యము

ప్రతులకు :
ఓగేటి పశుపతి
విద్యాక్షేత్రం
యాజలి (P.O.), బాపట్ల (H.O.)
గుంటూరు జిల్లా.

ముద్రణ :
R. K. ప్రింటర్స్
జి. బి. సి. రోడ్
బాపట్ల.

యోగ వందనం

— నెమ్మాని సీతారామయ్య, బాపట్ల

శ్రీ ఓగేటి పభపతిగారు కవిగా లబ్ధప్రతిష్టులు. సంస్కృత వాఙ్మయంలో కొమ్ములు తిరిగిన రచయితలు వాల్మీకిని "కవి"గా పేర్కొన్నారుతప్ప, విశేషణాలు చేర్చలేదు. అలాగే నేటి పభపతిగారుకూడ అచ్చమైన "కవి" శబ్దవాచ్యుడు. సన్మానాలకూ, బహుమతులకు, కానులరానులకు కవిత చెప్పినవారుకాదు బహుకాలం వీరి కవితాసరస్వతి అంతర్లీనంగానే ఉంది. కాని రామకృష్ణకథల ప్రచురణతో సహృదయహృదయాలలో లీనమై ప్రశంసాపాత్రమై

"పభపతి సత్కవీంద్రుడని
పల్కుట చాలదు చిద్విశిష్టతల్
వశపడినట్టి యోగి" యైనారు. అనాటికే!

కవియొక్క మానసికప్రవృత్తి కవియొక్క కావ్యంపైన ప్రభావం చూపుతుంది. పభపతిగారిని చిన్ననాడె పట్టి కదిపికుదిపిన మహానుభావులిద్దఱు. ఒకరు శ్రీరామకృష్ణ పరమహంస, రెండవవారు గాంధీమహాత్ముడు. మరి వీరు సమతా యోగమునకు, అమృతత్యాగమునకు ప్రసిద్ధులు ఇట్టి గుణసంపదకు పభపతిగారి హృదయం ఆలవాలమైనది. నిరాడంబరంగా జీవితాన్ని సాగిస్తూ, నేటికీ, ఏ నాటికీ కవితాసరస్వతీ అనుగ్రహంతో చెక్కుచెదరని కమ్మని కావ్యాలు వ్రాస్తున్న మహాయోగి.

"నా న్మపిఃకురుతె కావ్యమ్" అన్నారు పెద్దలు.

ఋషి కానివాడు కావ్యం చేయలేడని దీని అర్థం. ఋత్-దర్శనే-శబ్దాన్నిబట్టి త్రికాలదర్శనం చేయగలవాడు ఋషి. ఇట్టి దర్శనశక్తిగలవాడే కావ్యరచన చేయగలరని తాత్పర్యం. కాబట్టి ఋషియై - కవి అయితే - వాని కర్మ కావ్యం. అందుకే కవిని క్రాంతదర్శనుడన్నారు. ఇతడే ప్రతిభావంతుడు. నవనవోన్మేష శాలినియైన ప్రజ్ఞకే ప్రతిభ అనిపేరు ఇట్టి అనంతశక్తిసంపన్నుడే కవి. అతని కావ్యమే. కాలప్రవాహానికి తట్టుకొని, గట్టునెక్కి శాశ్వతంగా ఉంటుంది. ఇదంతా ఎందుకంటే శ్రీ పభపతిగారు ఋషియైన కవి శబ్దవాచ్యుడు. వీరి కావ్యములు శాశ్వతము. సహృదయుడు చేతబట్టి చదివితే ఈ సరస్వతికి సాగిలబడి నమస్కరించకతప్పదు. అంతేగాక శ్రీ పభపతిగారి సరసన మరొకరి

పేర్కొన మనస్కరించదుకూడ. ఇన్ని మాటలేల? శ్రీ విశ్వనాథ వీరి కవిత్వం విని - మూలవిరాట్టులు మీరు కూర్చొనివుంటే - మేము ఉత్సవ విగ్రహాలమై ఊరేగుతున్నామన్నారు.

ఇట్టి కవియొక్క కావ్యాన్నిగూర్చి వ్రాయాలంటే సాహసం కావాలి. కాని వీరిపై నాకున్న పూజ్యభావం పురికొల్పుతుండటంతో సాహసిస్తున్నాను. ఇదివరకే "తప్తహృదయము" నకు అభివందన చందనం సమర్పించాను. వీరి "మాహేయి" కి నీరాజనం పట్టాను. ప్రస్తుతం "వియోగయోగము" నకు "యోగవందనం" చేస్తున్నాను.

ప్రస్తుత కావ్యం వియోగయోగము. వియోగము అంటే ఎడబాటు. యోగము అంటే కలయిక. ఇది శృంగార రససంబంధికాదు. శృంగారరసంలో సంయోగ వియోగభేదముంది. సంయోగ శృంగారం కాలం గడిచేకొద్ది తగ్గేది వియోగం. కాలం గడిచేకొద్ది వేడెక్కి వాడి తేలుతుంది. "నవినా విప్రలంభేన శృంగారః పుష్టిమశ్నుతే" ఏ ప్రలంభం లేని శృంగారమునకు పుష్టిలేదని తాత్పర్యం. ఈ విప్రలంభమే వియోగము. ఈ ఎడబాటు భార్యాభర్తలు, ప్రియుడు ప్రియురాలు, భక్తుడు భగవంతులమధ్య కావచ్చు రాగవిరాగములు యోగవియోగములు, యోగార్థమేనని "యోగార్థము సంస్మరింతు యోగేశహరిన్" అని కవిభావన. కాబట్టి ప్రస్తుత వియోగయోగము ఎవరికి? ఎవరిమధ్య? భక్తుడు భగవంతుని - శ్రవణం మొదలు ఆత్మ నివేదనంవరకు తొమ్మిది మార్గాలలో సేవించితరించవచ్చు. కాని ఈ మార్గాలలో భగవత్-భాగవతుల సాన్నిహిత్యం, సాన్నిధ్యం తక్కువ. ఇక వియోగయోగ కావ్యం రెండు భాగాలుగా ఉంది. వియోగవాత్సల్యము, వియోగవాల్లభ్యము అని. వియోగవాత్సల్యము యశోద కృష్ణులకు, వియోగవాల్లభ్యము గోపీకృష్ణులకు సంబంధించినవి. యశోదకు కృష్ణునిపై వాత్సల్యభక్తి, గోపికలకు కృష్ణునిపై గలది మధురభక్తి. పంచవిధ భక్తిభావాలైన - శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధురభావాలలో ప్రేమ, చనువు, సమానత్వం, అత్యంతసాన్నిధ్యం భక్తునికి భగవంతునితో ఉంటుంది. పంచవిధ భక్తిభావాలతోకూడ గోపికాభక్తి పరాకాష్ఠ అన్నారు పెద్దలు. ప్రస్తుత వాత్సల్య - వాల్లభ్యములలో నిరంతరము ఆ స్వామి, సన్నిధి కలిగి వున్నా, అంతలో మాయమై యశోద - గోపికలను పరితాపానికి గురి చేస్తాడు. కాని వారేమైనా ఏమరుపాటు పొందుతారా! ఏమి చేస్తున్నా ధ్యాసంతా ఆ స్వామిపైనే! ఇక్కడ జగన్నాథ పండితరాయలు ఒక మాటన్నాడు చూడండి!

శ్లో॥ పుంఖానుపుంఖ విషయేక్షణ తత్పరోపి
బ్రహ్మావలోకనధియం, న జహాతి యోగీ
సంగీత తాళ లయ నృత్త వశం కరోపి
మౌళిస్థ కుంభ పరిరక్షణ ధీ నటీవ!!

యశోద - గోపికలకు ఇదే దృష్టి. అయితే యశోదకు వాత్సల్యము. తల్లికి శిశువుపై ఉండే భావం వాత్సల్యం. బాలకృష్ణునిపై యశోదకున్న ప్రేమ - మమకారం మొదలైన గుణాలన్నీ ఇందులో ప్రస్ఫుటితం. మాతృభావమైన ఈ వాత్సల్యం చాల మృదువైనది. సుకుమారమైనది. కాబట్టే కవిగారు ఈ భాగంలో ఉత్పల చంపకమాలా ఛందస్సునే వాడారు. భావానుగుణమైన ఛందస్సును వాడడం పూర్వకవి సంప్రదాయం.

ఇక వియోగవాత్సల్యం ఏమిటో చూద్దాం! చీకటిరాత్రి - అందరిసీ ఏమరించి ఊరిమీదపడ్డ వెన్నెలదొంగ ఎంతకు ఇల్లు చేరలేకపోతే యశోద ఆ బిడ్డకోసం పరితపిస్తుంది. ఇంతే అంశం. కాని కవిగారు సహజంగా బిడ్డ కోసం తల్లడిల్లేతల్లిని ఆధారం చేసుకుని - ప్రతిపద్యంలో ప్రతిధ్వనించే భగవత్ స్వరూపం - నిబంధించిన విధానం అద్భుతం. సహృదయుడు తన్మయీభవన యోగ్యతను పొందగలచందం ఆశ్చర్యం. ఈ ఘట్టంలో కృష్ణుడు బాలుడే! అన్నీ చిలిపిబుద్ధులే! అల్లరి పనులే!

"ఇప్పటిదాక ఆడుకొనె
నిక్కడె ఒక్కడు - అని ప్రారంభం

ఇప్పటిదాకా ఇక్కడే ఒక్కడే ఆడుకొన్నాడు. కన్నుమూసి కన్నువిప్పేలోపల తుళ్ళుమన్నాడు. వేయివిధాల చెప్పాను కాని నా భ్రమేగాని - నా గుప్పిటలోనే ఉండునా - గుట్టుగగుట్టుగ చిన్నిబిడ్డగన్" అని యశోదపరితాపం. ఈ పద్యంలో పైపైభావం సహజంగా ఒకతల్లి పొందే ఆవేదనే! ఇది స్పష్టంగానే తెలుస్తున్నది. కాని కవితార్థయుక్తి లోనారసి చూస్తే - ఒక్కడు, వేయివిధంబులు, భ్రమ - నా గుప్పిలిలోన - గుట్టుగ - గుట్టుగ మొదలైన పదాలలోనున్న స్ఫురణ (ధ్వని)నుగూర్చి వ్రాయదలచినట్లైతే యిదే వ్యాఖ్య అవుతుం "నిల్పాడొక్కెడ ప్రపంచము సర్వము వాడె" లనుకొంటుంది. చిన్నవాడే - ఒకచోట ఉంటాడా మరి. అంతటా తిరుగుతాడు పైకి భావం. భగవంతుడు ఒకచోటే ఉంటాడా!

ప్రపంచము సర్వమువాడే - విశ్వం - విష్ణుః - సర్వాంతర్యామికదా అన్నభావం స్మరణకురాదా! తల్లికి బిడ్డ దీపమే! చీకటి పారద్రోలడానికి ఎన్ని దీపాలు పెట్టినా ఈ దీపంతో సరిరావు.

దీపము దీపదీపమును
దీపము దీపము దీపదీపమౌ!!

మరి ఈ దీపము జ్యోతిషామపి తజ్జ్యోతిః - తమసః పరస్తాత్ - పెంజీకటి కవ్వల నెవ్వడు ఏకాకృతి వెలుగు - వెలుగుకాదా! పుత్రమోహలతలు హృదయాంతరంలో కుంజపుంజములుగా అల్లుకొన్నవి. ఆ అయ్యకు దాగుడుమూతలకు అనువైన తావు చిక్కినది. ఇక నాకెక్కడ చిక్కుతాడు - వార్షుకాంబుద నవాసిత శైశవ మూర్తి ఈ నిసిన్ - అంటుంది అమె పరమాత్మ హృద్గోచరమేకదా! అక్కడే దాగుడుమూతలు. నీలమేఘశ్యాముడు చీకటిలో కలిసిపోతాడు. యోగి హృద్గుహలలోచూరి సొమ్ములన్నీ హరించి పర్వులెత్తడం స్వామి జగత్పతి లీలట ఈ ఒడుపెరిగి వాడుచాడుగదా. ఆ అలవాట్లు పోవక ఇక్కడకూడ నిటుసేయునేమో? ఒకటే అనుమానము - అంటుంది యశోద! దేవునితో జీవునకుండే తొమ్మిది విధములైన సంబంధాలలో స్వామి - సొమ్ము సంబంధం ధ్వని. నా అభిమానమున్ పరువు - వాడు ప్రతిక్షయు నాభిజాత్యమున్ నా యనునట్టి దంతయును నాశమొనర్పగ వాడు పుట్టె"నని యశోద బాధ. దుష్టుడైనకొడుకు వలన ఇవన్నీ పోవునని పై అర్థం - కానీ ఇవన్నీ పోనాడితేతప్ప శిష్టుడైన ఈ పుత్రుడు జీవుని కడతేర్చడుకదా! ఇవన్నీ ఏదో ఉన్నవని జీవుడు తలచడం అజ్ఞానం.

"బాలుడు కాడు వాడు బల
వంతులలో బలమంతవాడెపో"

అని ఆమె అనుకుంటె— "బలం బలవతాంచాహం" అని సహృదయుడు పరమాత్మనుగూర్చి జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. స్వప్నజాగరల భేదమెఱుగక తలచిననే బర్హిబర్హ సుమనోహర సుందరమౌళి మౌళిగన్ - మున్ముందర కనపట్టునుగదా! ఇందలి సుందరమౌళి - మౌళిగ కన్పట్టు సౌందర్యము ఆస్వాద యోగ్యము. అఖిలాండనాయకుని పోకడ పోవును వాడు నా కడన్ - కాబట్టే ఇన్ని పోకడలు - ఆగడాలు. గోపికల ఇండ్లలో అల్లరిపనులు చేసి ఇంటిమీదికి తెస్తాడు తగవులు. పాపం - యశోద వారితో వాదిస్తూ ఉంటే - ఇక ఆ బాల

కృష్ణుడు - సాక్షిమాత్రుడై అన్నియు జూచుచే మెఱుగనట్టులె యుండును వాడు నా కడన్ అన్న పద్యంలో పై అర్ధం స్పష్టమేకదా! ఇక భగవత్పరంగా జీవులతో ఆడుకుంటూ ఏ బంధాలు అంటకుండా తాను సాక్షిమాత్రుడేకదా! తాను కూటస్థుడేకదా! ఈ రమణీయార్ధాన్ని ఎంతైనా వివరించవచ్చు. ఈ విధంగా ఈ భాగంలో ఎంతో రమణీయత తాను పెంచుకొన్నదట. "పయోధి శేషశయనస్థితు నచ్యుతుగా" ఈ పయోధి శబ్దం ఇక్కడ సార్ధక ప్రయోగం. మరి దుప్పట్లోదూరి కనపడకుండా ఉన్నాడేమోనని అన్ని విదిల్చి - కనుపట్టని యంత అణూపమస్వరూపుడౌ యని నివ్వెఱ మునిగి పోవునామె. మరి పరిత ఇచ్చో - అణోరణీయాన్ మహతో మహీయాన్ - అని ఆత్మస్వరూపుడైన పర మాత్మను అనుసంధానం చేసికొని నివ్వెఱ మునిగిపోడా! ఇక నేను వాడికి అమ్మనుగాను! ఆడుకొనే కీలుబొమ్మను! తన ముచ్చటలెల్ల దీఱుదాక నాడి యాడి పిమ్మట కీలుకీలు దీసి - నామరూపాలు - లేకుండా నాకు చేసి - వాడే సమస్తము నేను లేనిచట - అంటుంది. ఎన్ని ఆటలు ఆడినా, చివరకు పర మాత్మే మిగిలేది! నామరూపాత్మక జగత్తు అంతా అశాశ్వతమేకదా! చివరకు కృష్ణుడె - విష్ణుడని అనిశము కృష్ణనామ జపమే. తత్సంబంధ చిఱురూపనామ జగత్తే నిలిచిపోయినది. ఇది వియోగవాత్సల్యం.

ఇక వియోగవాల్లభ్యం! ఇది గోపిక - కృష్ణులమధ్య. ఈ కృష్ణుడు బాలుడుకాడు. కుహనాగోపాలుడు. జగన్నాటక సూత్రధారి. భాగవత మహాకావ్యంలో గోపికా కృష్ణుల రాసలీల సుప్రసిద్ధం మరి ఎంతో అపోహకు గురియైన ఘట్టంకూడ. కాని ఇది మూలం తెలియని మూఢసంప్రదాయం. భాగవతంలో దశమస్కం దానికి రాసపంచాధ్యాయి ప్రాణం. ఈ రాసలీలను పెద్దలు "కామవిజయం"గా పేర్కొన్నారు. అనగా పైకి కామప్రసంగమేకాని, ఇది నిజానికి విషయసుఖ విరహిత అప్రాకృత - గుణాతీత ప్రేమ. భాగవత వ్యాఖ్యాత శ్రీధరస్వామి "భగవతః కామవిజయరూప రాసక్రీడా శ్రవణాదేః "కామవిజయమేవ" ఫలమాహ విక్రీడితమితి. అచిరేణ ధీరస్సన్ హృద్రోగం కామం అశుఅపహినోతి పరిత్యజ తీతి"–అన్నారు కాబట్టి దీనిని కామక్రీడగకాక కామవిజయంగా భావన చేయాలి.

వియోగవాత్సల్యము నందు వలెనే ఇక్కడకూడ ప్రతిపద్యం ధ్వన్యాత్మ కంగా సాగుతుంది. అయితే అక్కడ వాత్సల్యమైతే - ఇక్కడ వాల్లభ్యంగా

మారుతుంది. అక్కడ యశోద - ఇక్కడ గోపికకదా. ప్రధానపాత్రదారులు ఈ ఘట్టమంతా శార్దూల మత్తేభాలతో నడుస్తుంది. వాల్లభ్యమంటే ప్రభుత్వము దొరతనము అని భావం. వెన్నెలరాత్రి బృందావనంనుండి మురళీనాదం వినిపించగా పరువులెత్తిన గోపిక అక్కడ వల్లభుడు కానరాక పరితపిస్తూ వియోగవాల్లభ్యమును పొందుతుంది. యమునాతటిని వల్లభునికోసం గోపిక అన్వేషణ. పోతన ఈ ఘట్టాన్ని భాగవతంలో పరమరమణీయంగా తీర్చిదిద్దారు. ఇక శ్రీ పతిగారి గోపికలో ఆర్ధ్రత - జాలి - దైన్యము దర్పము అన్నీ గోచరిస్తాయి. ఈ తలపులో వలపు ప్రధానంకాగా మరొకభావం చమత్కారం స్ఫురణ దర్శనమిస్తాయి. వాచ్యార్థముకన్నా వ్యంగ్యార్థం రమణీయంగా ఉంటే అది ధ్వని అన్నారు. ఈ ధ్వని ఆయాపద్యాలలో పట్టి చూపుతుంది. ధ్వని ప్రబంధకావ్యం ఉత్తమకావ్యం.

ఇక సోదాహరణంగా కొన్ని మట్టాలు పరిశీలిస్తాను. యమునాతటిలో గాలి వాని పచారకములు చెబుపోయినది. తటిపై వృక్షమొక్కటియు జూడ చెప్పదు. ఊరక తలలూపు. ఇది చమత్కారమో సీత్కారమో!

"నటసామ్రాట్టగు వాని శిష్యనట రత్నాలేము వీరందఱున్"

అంటుంది గోపిక. కృష్ణుడు కనిపించలేదని పరితాపం - పట్టరాని కోపం. ఈయన ఒక నటసమ్రాట్టు. ఇక వీరంతా శిష్యనట రత్నాలు అని పై భావం. కాని జగన్నాటక సూత్రధారియైన ఆ పరమాత్మకు ఈ జీవలోకమంతా శిష్య వర్గమే! ఆయన ఆడమన్నట్లు ఆడాల్సిందే! గురు - శిష్య సంబంధం పరమాత్మ జీవాత్మకు కలయకదా! వ్రజకాంతలందఱవలె నన్ను బొమ్మ గోపెమ్మ అను కున్నాడో యేమొ? ఆడుకోడానికి ఆ ఆటలు సాగవింక. అహంతలుత్వంతలు లేని కొయ్యనుగాను, ఎవ్వడో ఆడమంటే ఆడడానికి అని భావన చేస్తుంది. ఇందులో దర్పం-అహంకారం! ఈ అహంతలుత్వంతలేకదా అన్నిటికి కారణం! అక్కడకూడా సున్నితమైన హాస్యంకూడ రచనలో గోచరమౌతుంది తలలో నెమ్మలి ఈకలు, బాహులకు దారాలతోరాలు, మొలలో చిల్లుల వేణుకాష్ఠము. అబ్బో! ఈ మహావేషము గొల్లతలకు వ్రేపల్లెకు చెల్లింది కాని, పట్టణాలకుబోతే ఈ వేషాన్ని జూచి ఆడవాళ్ళు పీకిపెడతారు అంటుంది. కుహనాగోపాలుడు

కనబడకపోవడంతో విసిగిపోయిన గోపిక బంధములు వానితో తెగినవని భావిస్తుంది. ఇంతలో యమునానిలంతో ప్రచలితములైన ముంగురులు ప్రేలాడుతూ మొగమును కన్నులుగూడ కప్పి ఇంటికి బోకుండా వెంటాడుచు–

"పగబట్టెన్‌గట! తత్తనుచ్ఛవులు
కుప్యత్కాల సర్పచ్ఛటల్" అంటుంది.

ప్రొద్దు ఈ ధూర్తుమొగాననే పొడిచిందా! "గిరాగిరమమున్ బొంగ్రాలుగాజేసి గాన్గెద్దుల్‌గాగనుజేసి త్రిప్పికొనునా యెల్లప్పుడున్ చుట్టు" అని భావిస్తుంది. ఈ ఘట్టం చదవగానే సహృదయుడు

"ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూడాని మాయయా".

అని స్మరణకు తెచ్చుకోడా! చిన్నప్పుడు వానిపనులే చిత్రాలు! "ఒక్కమ్మ పాలును ప్రాణమ్ములు గ్రోలె - నో ర్తెఅచి ముల్లోకమ్ములన్ జూపె క్రన్నన నొక్కమ్మకు" అనగానే పూతన - యశోదలు స్ఫురించరా! "నేనను స్త్రీయె లేనితటి నేకచ్ఛత్ర వాల్లభ్యమున్ వెలిగింపంగను వచ్చునేమొ అని భావిస్తుంది. మరి ఇది సహృదయైకవేద్యమే! "పుట్టించెన్, దగహాయిగా సుఖముగా బొల్పారు నా లోపలన్" మరి సుఖము ఎక్కడుంది? ఖంలో ఉన్నది. అంతా శూన్యమే! అప్పుడే హాయిగా ఉండటం. కానీ గుండ్రాతికికూడ జుట్టు కాళ్ళు - వ్రేళ్ళు గోళ్ళు మొలపించగలడు - తర్వాత పంచభూతాలలో కలపనూగలడు. ఇంతటి యెమ్మె కాని నమ్మదగునా!

"కన్నులు రెండున్నవి తనకు - అవే లక్షల వేల పెట్టు యిక నెమ్మి కన్నులును నేలా? వానికిన్ నెత్తిపై అన్నుల్ గుట్టుగ గుట్టుగా బ్రతుకుటెట్లు? అంతర్మనఃపేటికాచ్ఛన్నముల్ గనిపెట్టి దోచుకొనె నా సర్వస్వమున్ వాడిటన్" అంటుంది ఇచ్చటి సారస్యం తమాషా చూడండి! కృష్ణుడి రెండు కన్నులే వాలు! అవే లక్షల వేలపెట్టు. ఇంకా నెత్తిపై నెమ్మికన్నులు ఎందులకో? ఇక స్త్రీలు గుట్టుగా బ్రతకడం ఎలా? మనఃపేటికలో దాచుకొన్నవికూడా కనిపెట్టి దోచుకుంటాడు! అని పై భావం. ఇక నెమలిఈక సహజంగా కృష్ణుని నెత్తిపై

చూచేదే! ఇక ఇది ఏ దేవతకూ అలంకారంకాదు. దీనిలో విశేషం లేకపోలేదు. అంగాంగ సంయోగంలేనిరీతి కేవలం చూపులలోనె వున్న ప్రాణి నెమలి. ఇక సహజంగా కర్షణశీలుడైన కృష్ణునకు ఇది అలంకారమై జగత్తునకు ఆనందాను భూతిని కలిగిస్తుంది. ఇక గోపిక వాడేనయ్యెనొ, నేను వాడైతినో - అని తన్మయతను పొందినది. ఇక కృష్ణుడో కృష్ణమ్మ అయి కూర్చున్నాడు. "కనులున్ వీనులెకాదు చక్కగ హృషీక గ్రామమున్ సర్వమున్ దనకర్పించితి" ఇది గోపిక భావన - భక్తుడుకూడ సమస్తము సమర్పణ చేస్తేనే భగవద్దర్శనం. రారా రార! యటన్న రాక చనుదూరంబౌచు నంతంతకున్ - పోరా! పోర! యటన్న పోక నికటమ్ముంజేరు నంతంత ఇది దైవసంపదలోని రహస్యం. "ఇచ్చలు నిచ్చలు రేపి మంటలిడి వాడేగె! కచ్చలు మాకుమాత్రం పుట్టవా? ఊరకుంటూమా - నేను మహాగ్రవ్యాళమై - నన్ను బొమ్మగా ఎట్లాడించాడో - అట్లాతని మచ్చిర్షస్పటిమీద చుమ్మలు సొమ్మల్వోవ నాడించెదన్" అని గోపిక కచ్చ ప్రదర్శిస్తుంటే, కవి కాళీయమర్దన దృశ్యాన్ని మన కన్నులకు కట్టి చూపించి, నేర్పు ప్రదర్శిస్తున్నారు. చివరకు మోజులన్నీ పోతాయి. జంజాటపు సొమ్ములేమిటికి అనిపిస్తుంది. బూజులు పట్టపట్టగా ఎప్పుడో వాడు రాగా తత్పదాంభోజస్పర్శకు ఘల్లున మొఱసి చీ కొట్టి బుద్ధి చెపుతాయి" అని వాపోతుంది గోపిక. ఇది భక్తుని భావనకూడ! చివరకు మిగిలేది స్వామిమాత్రమే సొమ్ములుకావు. ఈ రీతి పద్యరచనతో పఱపతిగారు పరితలను పరవశింప చేస్తున్నారు. ఇంతకు వియోగ వాత్సల్యములోని యశోద - యశోదకాదు - పఱపతిగారే! అలాగే వియోగ వాల్లభ్యములోని గోపిక - పఱపతిగారే అంటే అతిశయోక్తికాదు. ఆ పాత్రలే తానుకాకుంటే ఇంతటి వాత్సల్య వాల్లభ్యములు రచయిత ప్రదర్శించుట అసాధ్యము. ఇప్పటికే ఈ వివరణ విస్తరించింది. మన్నించాలి.

"హరినామ స్తుతిసేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ సురుచి భ్రాజితమైన మానస సరః స్ఫూర్తిన్ వెలుంగొందు"ను కదా!

ఓం తత్ సత్

—o—

అంతర్దర్శనం

భగవత్ప్రేమ అత్యంత దుర్లభమైనదైనప్పటికి అది సులభంగా లభిస్తుంది. "కృష్ణ మేన మవేహి త్వమాత్మాన మఖిలాత్మనాం" సకల జీవులలోను పరమాత్మ స్వరూపంతో శ్రీకృష్ణుడున్నాడు కనుక అది ఎప్పుడు? పాపాలు క్షీణించిన దిశలో, ప్రేమభక్తి మోక్షకాంక్ష తీవ్రమైన దశలో.

శ్రీమద్భాగవతంలో శ్రీ నరసింహావతార కథనంద్వారా క్రోధనాశనం, వామన చరిత్రద్వారా లోభనాశనం, నవమస్కంధంలోని శ్రీరామ చరితం ద్వారా కామనాశనం జరిగాక దశమస్కంధంలో సర్వావతారావతారి ప్రేమావతారుడుగా శ్రీకృష్ణభగవానుడు ప్రవేశిస్తాడు. మనస్సు పరిశుద్ధమైన తర్వాతనే, మనుష్యుడు అంతర్ముఖుడైనప్పుడే శ్రీకృష్ణుడు ప్రవేశించి తన లీలలను ప్రకటిస్తాడు అతని భక్తితీవ్రతను గమనించి భగవానుడు ఒక గురువును పంపుతాడు హృదయం పక్వమైనప్పుడే చిలుక వచ్చి దానిమొద వ్రాలుతుంది. మధుర రసాన్ని ప్రవింపజేస్తుంది. ఆ పుణ్యవతి ఎవరో రాధాదేవియే కావచ్చు. శ్రీ పశుపతి చేసుకొన్న పుణ్యంవల్ల ఆ కృష్ణభక్తురాలు పరిచయమయింది. ఆమెకు గల శ్రీకృష్ణానుశీలనం పశుపతిని ముగ్ధుణ్ని చేసింది. ఆ భక్తురాలి ప్రభావం సోకింది. అనువంశికంగా తమ కుటుంబంలోగల శ్రీకృష్ణ భక్తి ఆయన హృదయంలో పొంగిపొర్లింది. శ్రీ పశుపతిగారి పితృపాదులు శ్రీ నారాయణయ్య గారు శ్రీకృష్ణభక్తులు "కృష్ణా దీన చింతామణీ" అని ఆర్తితో ఆయన చదివిన పద్యాలు ఇప్పటికీ నా చెవులలో ప్రతిధ్వనిస్తుంటాయి.

నాకు విశ్వనాథ జీవితంతోను శ్రీ పశుపతి జీవితంతోను పరిచయం ఉంది, కనుక చెప్పగలుగుతున్నాను. శ్రీ మద్రామాయణ కల్పవృక్ష నిర్మాత విశ్వనాథ పోతనగారి భాగవతంలోని మొదటి పద్యంలోని రహస్యాన్ని చాలా కాలానికి తెలుసుకొన్నారు. "శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్" ఎవరిని చింతించాలి? "మహానందాంగనా డింభకున్" అని లోకానికి చాటారు ఈ రహస్యాన్ని పోతనగారు. "ముక్తిం దదాతి కర్హిచిత్స్మ న భక్తియోగం"

శ్రీకృష్ణుడు ముక్తినిస్తాడు. కానీ, భక్తినివ్వడు. కష్టపడి రామభక్తిని సంపాదించుకొన్నవారి హృదయంలో శ్రీకృష్ణుడు సులభంగా ప్రవేశిస్తాడు. "సీతా" కావ్య నిర్మాత అయిన శ్రీ పఱపతిని అత్యంత పునీతుణ్ని చేయడానికే శ్రీ భక్తులవారి రూపంతో ఆ మహాతల్లి వచ్చింది. తనకు సంతృప్తిగా శ్రీకృష్ణానుశీలనం చేయమని కోరింది. మొదటగా పఱపతి హృదయంలో ప్రీతివత్సలతా ఘనీభూత మూర్తి అయిన యశోద ప్రవేశించింది. శ్రీ విశ్వనాథకు "శ్రీకృష్ణ కథావిపంచి" మీటితేనే కాని నిద్రపట్టలేదు. అంతటి రామభక్తుడైన తులసీదాసు చివరికి శ్రీకృష్ణ లీలలు గానం చేశాడు. రామభక్తుడైన శ్రీధరస్వామి భాగవత వ్యాఖ్యానం చేసి చరితార్థుడైనాడు. ఈ రహస్యం పోతనగారు అనుభవపూర్వకంగా గ్రహించారు. ఇది సత్యం. దేశకాలపరిస్థితులు ఎంతగా మారిపోయినా సత్యం మారదు. ఓగేటి పఱపతి శ్రీకృష్ణ భక్తుడయ్యాడు. నాడు నేడును ఆయన హృదయం ప్రేమ వాత్సల్య సఖ్య దాస్య భావాలతో నిండిపోయింది.

చిన్నికృష్ణుడు ఎక్కడికి వెళ్ళాడో. యమున ఒక కృష్ణమ్మ. అమె శ్రీకృష్ణునికి తుర్యప్రియతమ. కృష్ణుడక్కడికే వెళ్ళాడా?

"నిశా సమయము భీతి గొల్పెడిని సర్వజగత్తు సుహృత్తువాడటో!" అనుకొంటుంది యశోద. జ్ఞానిమానుల జ్ఞానంకంటె యశోదకున్న అజ్ఞానం చాలా గొప్పది. జ్ఞానులు భగవంతుణ్ని చూడలేరు. తాకలేరు. చెవి మెలిపెట్టి ఇంటికి చేర్చలేరు. ఆ పనులన్నీ చేసింది యశోద. పై పద్యపాదంలో శ్రీ పఱపతి బహుజ్ఞతనుగూర్చి చెప్పేదేముంది కాని, "సుహృదం సర్వభూతానాం" శ్రీకృష్ణ ముఖనిఃస్రుతమైన గీతోక్తిని స్ఫురింపజేసి శ్రీ పఱపతి శ్రీ విశ్వనాథ తర్వాతి కవి తానే అనిపించుకొన్నాడు. విశ్వనాథ తన కవితావైభవాన్నేకాక, తన హృదయాన్ని, కంరాన్ని పఱపతికి ఇచ్చిపోయాడేమో అని నా అనుమానం.

శ్రీకృష్ణుడు మధురకు చేరాక నిజంగా వియోగాన్ని అనుభవించింది. మాతృహృదయమే. మాతృహృదయాన్ని భగవంతుడు స్వర్గీయమైన ఏ ఉపకరణాలతో, ఏ దివ్యప్రవృత్తులతో నిర్మించాడో ఏమో! యశోదవంటి తల్లి,

కృష్ణునివంటి కుమారుడు - అంతటి వాత్సల్య జలధి లోతు - పరిధి ఎవరు తెలుసుకోగలుగుతారు? యశోద హృదయం స్వాభావిక స్నిగ్ధ సుకుమారం. వాత్సల్య రసాస్వాదన జరిపించడానికే కాబోలు. తాను మధురలో అవిర్భవించిన మరుక్షణమే శ్రీకృష్ణుడు యశోదానంద గేహినిదగ్గరికి చేరాడు.

శ్రీకృష్ణుడొకసారి గోపికలనందర్నీ శరద్రాత్రి సమయంలో బృందావనానికి రప్పించి, వారందరు వచ్చాక తీరా తాను అంతర్ధానుడైనాడు. గోపికలు చిన్నపుచ్చుకొన్నారు. ఆ సందర్భంలో శ్రీ పణపతి ప్రాసిన ఈ పద్యం ఒక్కటి చాలు గోపీభావ మాధుర్యానికి మచ్చుతునక.

సరసత్వంబటి నాని సొమ్మగు యిదా
సారస్యమే నిట్లు లం
దరగాదంచు శరన్నిశన్ వలచిరా
దా మోము తప్పించె సి
గ్గరి, నిన్నన్ మలిసంజ ఘర్మసలిల
క్లాంతాస్మదాస్యంబు సి
గ్గగటి గోధూళి ముసుంగు నందెటుల
ముద్దాడెన్ పురీరద్యలన్

ఎంతో సింగారించుకొని శరద్రాత్రివేళ వస్తే మొగం తప్పించాడు కృష్ణుడు. చెమట ముఖాన్ని ధూళి ధూసరితమైన మోమును, సందెవేళ గోధూళి ముసుగులో నడివీధిలో ముద్దాడాడు. ఇదేమి సరసమమ్మా అంటుంది ఒక గోపిక.

ఇది లౌకిక రసజ్ఞులు చెప్పుకొనే విషయంకాదు. ఆత్మారాములైన మునీశ్వరులు భావించి ఆనందించే విషయం. "కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ" ఇట్టి రాగానుగమైన భక్తితో భజనీయుణ్ణి ముందుంచుకొన్నవారికి ముక్తితో పనేముంటుంది కనుక. ముక్తికంటే భక్తియే గొప్పది!

"ననుఁ బడదిట్టినన్ అనే పద్యం,

తలుపులు మూసెదన్ కొడుకు

తానిక రాడనుచున్॥

ఈ పద్యాలు మరపురానివి.

ఉండిన చాలు నా కడను

ఒప్పుల కుప్పగ॥

గోపే హృదయం నిండిన కృష్ణుణ్ణి లాక్కొని బయటికి తీసుకురావడానికి ఎవరికీ సాధ్యంకాదు. శ్రీకృష్ణుణ్ణి బంధించిన భక్తుని హృదయం మామూలు బందిఖానాకాదు.

ఏమైనా మా పట్టపతి హృదయంలో శ్రీకృష్ణుణ్ణి చేర్చిన ఆ మహాతల్లిని, గోపీ హృదయావిష్టుడైన మహాకవి పట్టపతిని మనసార అభినందిస్తున్నాను.

విధేయుడు,

ఉత్పల

హైదరాబాదు-35
23-1-2001

లేఖ - 1

మహాకవులు పట్టపతిగారికి

సముస్కారపురస్సరంగా వ్రాయునది. మీరు సాదరంగా పంపిన "విజోగ యోగము" అనే కావ్యరాజం అందింది. అస క్తితో అన్ని పద్యాలూ లప్రరిశీ పరించాను అనటంకంటే అది పరింపచేసింది అనడం సమంజసం

మీ కవిత్వంపై నాకు ఎప్పుడో సదభిప్రాయమూ విశేషగౌరవమూ ఏర్పడ్డాయి. ఇంత మంచి కవిత్వాన్ని రచించి, ఎందుకులే, అ దులో ఏముంది? అని యింతకాలం ప్రకటించకుండా ఉపేక్షించడం ఏం బావుంది చెప్పండి మహాశయా! అవునుమరి. కాళిదాసే అన్నాడుకదా! ఆత్మన్య ప్రత్యయం చేతఃఅని.

యతిప్రాసలకోసం తడుముకోవడం లేక సహజంగా, సాపీగా పద్యాన్ని **నడపడం మీసొత్తు. ఆ శిల్పం మీకు బాగా అలవడింది.** ఉదాహరించాలంటే **ప్రతిపద్యమూ** ఉదహరించవలసి వస్తుంది. మీరు జాతీయాలూ, నానుడులూ, సామెతలూ అలవోకగా ప్రయోగిస్తారు. అది చమత్కారాలపుట్ట. వాడెవడో అంటాడు - విజయ విలాసక ర్త అనుకుంటాను - తాను వ్రాసిన ప్రతి పద్యంలోనూ చమత్కారం ఉంటుందని వాడిమాట ఏమోగాని మీ ప్రతి పద్యంలోనూ చమత్కారం ఉంటుంది. వాడి చమత్కారం శాబ్దికం. మీది వాసనిష్ఠం. దాని కంటె యిది గొప్పదికదా!

యశోదకు సహజసిద్ధమైన మాతృవాత్సల్యంతోపాటు, తన పుత్రుడు సామాన్యుడు కాడనే తన్మాహాత్మ్య విజ్ఞానం ఆమె పాత్రలో బాగా చిత్రించ బడింది. అలాగే గోపిక విషయంలోకూడా ఆమెకు కృష్ణుడిపైగల అపారాను రాగమూ, తదప్రాప్తి జనిత సోల్లుంఠనమూ చక్కగా వర్ణించబడ్డాయి.

మీ సమాస మటనా నైపుణ్యం ప్రసంసనీయం. ఒక్క పొల్లు వాక్యం గానీ, వ్యర్థపదంగానీ లేకుండా నిర్దుష్టంగా, భావగర్భితంగా తెలుగుతనం ఉట్టి పడేటట్లు రచన చేయగలశ క్తి మీకు అప్రయత్నలభ్యం. ఒక్కొక్క పద్యమూ ఒక ఆణిముత్యం మీ విద్యాక్షేత్రంలో మొలకెత్తిన కమనీయ కవితాద్రుమం ఈ కావ్యం.

మీ కావ్యాన్ని అంకితం తీసుకోనున్న ఆ ఉత్తమ కృష్ణ భక్తురాలెవరో- ఆమె చాల అదృష్టవంతురాలు.

భవదీయుడు

రాజమండ్రి
8-2-2001

జొన్నలగడ్డ మృత్యుంజయరావు
ఎం.ఏ , పిహెచ్.డి.

లేఖ - 2

శ్రీ పశుపతిగారికి

నమస్తే. ఏభై ఏళ్ళతరువాత ఏ కవియైనాసరే యోగి కావాలి. కనీసం భ్రష్టయోగియైనా కావాలి. కాకపోతే అతని కవిత్వం అతనికే ఒంటబట్టలేదని అర్థం.

మీరు ఆజన్మయోగి. కాబట్టె మీరు యశోదయై వాత్సల్యం చూపించినా, గోపికయై వాల్లభ్యంకోసం తపించినా భగవంతుడు మీ చెంత ఉంటాడు. వియోగయోగంలో పద్యాలన్నీ అధ్యాత్మిక సుగంధంతో విలసిల్లుతున్నాయి. ఏ ఒక్కటి పేర్కొన్నా మిగిలినవాటిని తక్కువ చేసినట్లే, అన్నీ వెన్నముద్దలే. అన్నీ నవనీతయోగికి నైవేద్యాలే.

కాకినాడ
23-1-2001

మహాసహస్రావధాని
డా॥ గరికపాటి నరసింహారావు

కృతజ్ఞతాభివందనములు

ఈ కృతిని సమీక్షించి తమ అమూల్యములైన అభిప్రాయము లొసగిన కవిపండితులకు నా వినయపూర్వక ప్రణామములు.

- పశుపతి

అంకితం

బృందావనేశ్వరి

రావూరి అలివేలు మంగాదేవి

ఎవరో నీవెఱుంగ నింతదాఁకను నేను
ఎఱుఁగవట్లె నన్ను నీవుగూడ
పరమపూత చరిత బ్రాహ్మ మహాదేవి
నడపె నీకు నాకు నడుమవార్త

భాగవత దర్శనమ్మున
శ్రీ గాడేపల్లి సుకవి బృందేశ్వరిగా
బాగుగఁ బేర్కొనెను నినున్
దాగదుపో సత్యమెంత దాచినగూడన్

అంతమాత్రమ్మునన అది అగలేదు
చుడివి నా కృతి 'మా హాయి' సారెకీవు
కరగి కరగి కార్చికొనిన కంటినీరు
కడకు కాశిందిగా మారె కాల్వగట్టి

కలదు బృంద కలదు కాశింది 'మా హాయి'
కలదు గాని ర క్తి గట్టుటకును
కథకు నింక నొకడు కావలె శ్యామల
జలదమూ ర్తి రాస చక్రవ ర్తి

రంగ ద్వ్యాక్షేత్ర
ప్రాంగణ గోపాలు లీలనాతడు వచ్చెన్
రంగస్థలమ్ము మీదకు
మంగమ్మా! మనము వామమాత్రుల మింకన్

చేయించెను నీచే మా
హాయీ దానమ్ము నాకు నింకనునట్లే
నాయీ 'వియోగయోగము'
నీయెడ నాచేత నీకు నిప్పించె గృతిన్

ఇందుకొఅకొ ఏమొ యిన్నేడు లీకృతి
ఉండి వెలుగుజూడకుండ లోన
ఇపుడు వెలికివచ్చె నెవ్వరూహింపని
యట్లు హరి అనుగ్రహమ్ము కతన

పశుపతి

వియోగ యోగము

వియోగ వాత్సల్యము

(చీకటి రాత్రి. అందరినీ ఏమరించి ఊరిమీద పడ్డాడు వెన్నలదొంగ ఎంతకూ యిల్లు చేరని ఆ బిడ్డకోసం పరితపిస్తూ యశోద)

ఇప్పటిదాఁక ఆడుకొనె
నిక్కడె ఒక్కఁడు, కన్నుమూసి క
న్విప్పెడు లోనఁ దుఱ్ఱుమనె
వేయి విధంబుల బుజ్జగించుచున్
జెప్పితిఁ బోకు మెక్కడకు
నీవని నా భ్రమగాని వాఁడు నా
గుప్పిలి లోన నుండునటె
గుట్టుగ గుట్టుగఁ జిన్ని బిడ్డగన్

నిన్నకు నిన్నఁ బట్టుకొని
నిష్ఠుర పాశనిబద్ధుఁ జేసితిన్
కన్ననిఁగాని అంతయుఁగ
కావికిలయ్యెను సర్వబంధముల్
చిన్నము జేసికొంచుఁజనెఁ
జిత్రముగాఁ బసివాఁడు రేవగల్
తన్నుక చచ్చుచుంటిఁగట
దారియు డొంకయుఁ జిక్కికిచ్చటన్

కోపము గల్గుఁ దండ్రికిని
గొంచెము పాపని మందలించినన్
బాపము గల్గుఁదల్లికి క్ష
ణంబును పాపనిఁ జూడకుండినన్
పాపఁడు నిల్వఁడొక్కఁడఁ బ్ర
పంచము సర్వము వాఁడె యింక ఈ
కాపురమెట్లు సేయవలెఁ
గంటికిమంటికి నేక ధారగన్

సడినిసికారుచీకటులు
నల్లని వాఁడదలింపఁ జూచినన్
బడుతఁడు వానికన్నియును
బూర్తిగఁ దోడయి వచ్చెనో ప్రభూ!
కొడుకయి పుట్టి గుండియకుఁ
గూడును బట్టనిరీతి నీవె న
న్నిడుములు పెట్టుచుంటివటో!
ఏమి యొనర్చితి నంత దుష్కృతిన్

బిడ్డలు లేరె లోకమున
బెద్దగఁ గంటిమె యెక్కడైన ఈ
బిడ్డను బోలువాని మురి
పించుచునుం దినుపించుచుండె నా
గడ్డిని నాకుఁబెట్టి కసు
గాయను విట్టనరాదు వానినిన్
బొడ్డును ఊడనట్టి పసి
పూపను, వాదగు కర్మమంతయున్

బంగరుటుంగరాలు మణి
బంధుర సు దర కంకణాల్ల రీ
చుంగుల పట్టుదట్టి మఱి
సొంపుల యింపుల తారహారముల్
ఖంగున మ్రోఁగు కింకిణులుఁ
గల్మిల చెల్వకె కన్నుగుట్టు గో
పాంగనలింక నెట్లు విడ
నాడుదు రయ్యను దొంగలందఱున్

కటకట! గొల్లకన్నియల
కన్నులు పుంచివికావు పోసితిన్
మటమట మండి భగ్గున
మంటల 'దిష్టిని' దీసి కొంచెమున్
జిటపటలాడ దుప్పు, నెదొ
చిత్తము తత్తరమందుచుండె నా
చిటిపొటి చిన్నితండ్రికిని
శ్రీహరి తోడయి నిల్చు గావుతన్

తీఱక ముద్దుముచ్చలు
తీసి మదీయ విభూషలెల్ల జె
ల్వారగ గట్టపెటితిని
వానికి బోయెనువాడు చయ్యనన్
వారికి వారికిన్ దనదు
వైభవమెల్లను జూప నెట్టులిల్
చేరునొ! ఏమొ! క్రమ్మకొనె
జీకటి నల్దెసలందు గ్రందుగన్

దుడదుడ వచ్చి ఏడి? మన
దుందుడుకుం గొడకంచు గ్రుచ్చి న
న్నడిగిన నేమి చెప్పవలె
నయ్యకు మాటలు రాక కంటికిన్
కడవెడు నీళ్ళు గార్చునను
గన్గొని తా గడు కోపగించుచున్
పడపడ దిట్టుగా డసలు
బాలుడు కాలుడు వాడు నా యెడన్

దీపము లెన్ని పెట్టినను
దీఱునె చీకటి ఈ గృహాన౮ద
ద్దీపము దీపదీపమును
దీపము దీపము దీపదీపమౌ
నా పసితం౬డిలేక రతనాల
వరాల గుణాలమూట నా
పాప౮డులేక లేక కనుపాప
యెఱుంగక యేదొ పల్కెదన్

ఎక్కడ నుంటి విందనుక
నిల్లును వాకిలి పట్టదాయె నీ
వెక్కడ! ఎక్కడుంటివని
యెంతగ బుగ్గలు పిండి అడ్డినన్
ఒక్కటెమాట యిక్కడనె
యుంటి ననుంబసివా౮డు నా కసుల్
బొక్కలుపడ్డ వొక్కొమును
మందర ి డ్డను జూడనంతగన్

ఆనలిడి పుత్ర మోహలత
లల్లుకొనెన్ హృగయాంతరంబునన్
ఘనముగ౮ గుఁజపు జములు
గా నిక దాగుడుమూతలాడగా
ననువగుతావు చిక్కినది
అయ్యకు వా౮డెటు చిక్కు నాకు మో
హనతర వార్షుకాంబుదన
వాసిత శైశవమూర్తి యీ నిసిన్

ఆరట మప్పు బిడ్డఁడొకఁ
డైనను లేడని బిడ్డఁడుండి యి
ట్లారట మిప్పుడున్ గటక
టా! యిఁక నెప్పుడు జీవితంబు నం
దూరట జీవికుండియును
నుండమి గూడను ఒక్కఁడయ్యె సం
సారము సారహీనమని
చాట జనించెనో! యేమొ! వాఁడిటన్

దండిగఁ గారు దుగ్ధములు
త్రాగఁగ వచ్చును బిడ్డఁ డుట్టిపై
కుండకుఁ దూట్లు పెట్టినను
గ్రోలుట కిచ్చట నేమియుండు నా
గుండెకుఁ దూట్లు పెట్టినను
గుంపెఁడు మోహములున్ దిగుళ్ళునున్
బండెడు కోపతాపములు
వంతలు చింతలు పల్వరింతలున్

తొడితొడి యోగి హృద్గుహలు
దూరుట అచ్చట సొమ్ములన్నియున్
వడివడి దోఁచి పర్విడుట
స్వామి జగత్పతి లీలలంట ఈ
బుడుతఁడు వాఁడు కాఁడుగద
పోవక ఆ అలవాటు లెల్ల ని
య్యెడ నిటు సేయునేమొ! ఒక
టే అనుమానము నాకు నిత్యమున్

యమునకు నాదు బిడ్డకును
నయ్యది యేదొ మహాపురాసుబం
ధము గలదఁచు దోఁచునుగ
నంగన శ్యామలమూర్తు లిర్వురున్
యమున నుఁూడఁ బోవఁడు గ
దా! పురుగో! మఱి పుట్టయో! నిశా
సమయము భీతి గొల్పెడిని
సర్వజగత్తు సుహృత్తు వాఁడటో!

అక్కట! యెంత సేయవలె
నంతయుఁజేసి అమాయకుండుగా
నక్కుచు నింట మోపుఁ జర
ణంబెపుడో! కసిపుట్టి కొట్టగా
తెక్కల నెత్తఁ బూనినను
లేవవు చిట్టల పుట్టవాఁడు నా
కెక్కడ దాపురించె జగ
దీశ్వరుఁ బెట్టును బుట్ట లోపలన్

ముకుమిడి వచ్చి దొంగ యని
ముంగిటఁ గ్ష్ణునిఁబట్టి తిట్టి పో
సిన వ్రజకాంతలే తిరిగి
చేరఁగఁ బిలుచు వాని, వాఁడుఁ జెం
గునఁ జను సిగ్గు నెగ్గులును
గొంచెము గూడను లేవు వారికిన్
మనమునఁ జచ్చిపోక అభి
మానము ముచ్చిరు చుంటినేనిటుల్

రుచిగను లేవో! కార్పాసము
లున్ మఱి చేదులో! తల్లిపాలు, సం
కుచితపుబుద్ధి గొల్తల
కొంపలకుం బరువెత్తు రేల్మవి
మ్లుచువలె నాల పాల్ పెరుగు
గ్రోలును ముక్కులు మూతి రోఁతగా
పచియును మంచిచెడ్డయును
శుభ్రము నన్నది లేదు వానికిన్

రోఁతగ వెన్న మెక్కుటే యె
ఱుంగును గాని రవంతయైననున్
మూతికినంటు వెన్న విడి
పోఁదుడు వంగ నెఱుఁగఁ డింతకున్
వ్రేతలు వెంబడించి బెది
రించుచు నీతఁడె దొంగయంచు అ
మూతిని జూపినన్ బదుర
ముందర నా బ్రదుకేమి కావలెన్

నా అభిమానమున్ పరువు
నాదు ప్రతిష్ఠయు నాభిజాత్యమున్
నా యనునట్టి దంతయును
నాశమొనర్పఁగ వాఁడు పుట్టె నె
న్నో యిడుకొంటి నాశలను
ఉల్లము నందవి యెల్ల గాలికిన్
బోయెను నేనిటన్ మిగిలి
పోతిని ఉత్తగ చిచ్చకత్తెగన్

కొండిక బుద్ధిగాని యిది
కూడునె వాఁడు పవిత్ర మాతృహ్మా
ద్భాండసుధన్ ద్యజించి చని
తద్వ్యజకాంతల యిండ్లు దూరి మ్మా
ద్భాండగవీదధిన్ గఱవు
పట్టినయట్టుల మెక్కుఁ దల్లియున్
దండిరియన్న చిన్న మమ
తా గుణమైనను లేదు వానికిన్

కన్నపు నల్ల దొంగయని
కన్నులనిప్పులు పోసుకొంద్రు నా
కన్నని జూచినంత వ్రజ
కామిను లీసునఁగాని చిన్ని నా
నాన్నకు లోపమున్నదె! ఘ
నాఘన బిక్కణమూర్తికిన్ బల
ద్విణ్ణవ కోమలోపల సు
దీధితికిన్ శిఖిపింఛమౌళికిన్

ఇక్కడ దక్కడక్కడది
యిక్కడఁ బెట్టుచు దేనికోసమో
యెక్కడొ దేవులాడెద ని
సీ! మతిపోయెను వాఁడులేక నా
ప్రక్కను నింద్రభోగములు
భాగ్యములున్ పరితూఁగ వింతయున్
జక్కని నాదు బిడ్డ యెల
నవ్వునకున్ జిఱుకాలి మువ్వకున్

తెలియని వాని యట్లెదియుఁ
దేపకు నా కొసకొంగు వ్రేలికిన్
మెలివడఁ జుట్టు కొంచనుగ
మించుచు వచ్చు నెఱుంగలేక ఆ
మెలికల గుట్టు నా యెడఁద
మెత్తవడుంగడు సందు చిక్కగన్
మెలికలు వీడు, వీడునను
మెల్లఁగ మెల్లఁగ వాఁడున్సందుడిన్

ఱోలునఁ గట్టివైచినను
ఱోలును నీడ్చుకపోయె నింక నా
కాలునఁ గట్టివైచుకొనఁ
గావలె వానిని నట్టులైన నా
కాలును నన్ను నీడ్చికొని
గట్టిగపోడని నమ్మొటెట్ల హెూ!
బాలుఁడు కాఁడువాఁడు బల
వంతులలో బలమంత వాఁడెపో

గుటగుట బొజ్జ నిండుగను
గ్రోలి పయస్సులనెల్ల రిక్తముల్
ఘటముల నేలపై పగులఁ
గా గిరవాటిడు వాని ఆటకున్
కటకట! నేటికిట్లు బలి
గానయిపోయెను గన్నతల్లి ఈ
ఘటమును దీఱు టెట్టులిఁక
గన్నని ఆకలి రేపుమాపులన్

ఎదొ చిఱుకోడు నా కనుచు
నెంచుచుఁ బెట్టెతినింట దివ్వె న
య్యదియును జిన్న గాలికని
నట్టిటుఁ గొట్టుకలాడు; వట్టి గ్రు
డ్డిది, కొడిగట్టు మాటికిఁ, జె
డెంజెడె నంతయు నింకఁ జీకటిన్
జిదుముచు బాలబానుని వ
లెన్ ననుఁ బ్రోవఁగ వాఁడె రావలెన్

అపర మహీధ్ర సానుగతుఁ
డయ్యును సూర్యుఁడు కాకముందరన్
స్వపనము లారగింపులునుఁ
జక్కగఁ బూర్తి యొనర్చి, పూలపా
నుపు లమరించి శేషశయ
నున్ బొనరించెదఁగాని స్వామి వా
రెపుడెటు మాయమౌనొ! అగు
నించుక ఏమటి వచ్చి చూచినన్

కొడుకిలు చేరలేదనుచుఁ
గుందుచు మేల్కొని యుండియుండి యె
ప్పుడొ కనుమూసెదన్ భువన
మోహనుఁడప్పుడు తోఁచి సంబరం
పడుచును లేచి చూచెద గ
భాలున, నెవ్వరు నుండరంచుఁ దె
ల్లిడిసెడి స్వప్న జాగరల
భేదమెఱుంగక విహ్వలించెదన్

అందఱు వంటివాఁడటవె

అయ్య, జగత్త్రయ వల్లభుండు గో
విందుఁడె పుట్టెనింట నిటు

వెఱ్ఱిగ నేడ్వకు మంచు ముందలిం
చుం'దను' నన్ను, నా మనసు

సుంతయు నిల్వదు వాఁడు లేక ము
న్ముందర బ్బ్రహ్మ బ్బ్రహ్మ సుమ

నోహర సుందర మౌళిమౌళిగన్

ఎదురుగ వాఁడు లేనితఱి

నేదియొ ఏదియొ అండు వాని వాఁ
డెదురుగ వచ్చి నిల్చినపు

డేలనొ! రాదొకమాట నోట ని
య్యదిగని వాని ఆగడము

లంతకునంతకు మీఱె, నేమి చె
ప్పుదు నఖిలాండ నాయకుని

పోకడ పోవును వాఁడు నా కడన్

విడువక యెద్దు పాల్ పెరుగు

వెన్నలు మెక్కిన వాని మూతులన్
దుడిచిన జిడ్డుగుడ్డలును

దుందుడు కొప్పుఁగ వాఁడు రేబవల్
తొడితొడి పీకిపెట్టిన కు

రుల్ ననుఁ గన్గొని నవ్విపోరె! యె
క్కడ కొడుకమ్మ యెక్కడ? జ

గమ్మున నన్నియుఁ బిచ్చి మోహముల్

కని కడుపార పాలొనఁగి
కమ్మగ నెమ్మిగఁ బెంచుకొన్న అ
మ్మను ననుఁ గాదటంచుఁ జని
మాటికి నాపయిఁ దండ్రికేమొ చె
ప్పను సర్రికొత్త కొండెములు
బోలెడు తానవి నమ్మి మందలిం
చును ననుఁ బిడ్డ చెప్పినవె
నూక్తులు తండ్రికి వేదవాక్యముల్

క్రన్నన జీకటుల్ బలిసెఁ
గన్నఁడు తిన్నగ నిల్లుచేర లే
దన్న భయమ్ము, కొంపపయి
కల్లరు లింకెవి తెచ్చిపెట్టునో
అన్న భయమ్ము నా కిచట
నన్ని భయంబులె కానివానికిన్
చిన్నము గూడ లేదు భయ
చిహ్నము హేలలు లీలలన్నియున్

వెదురుల యీల పుల్లలును
వెంబర విత్తులు గొల్ల పిల్లలున్
మొనవులు లేఁగలున్ నెమిలి
పుంజులయాఁకలు నన్నవాని నె
మ్మదికిఁ బ్రియంబు లెంతయు
నమాయకపుం బసివాఁడు వాని నె
య్యది అనరాదు దేవుడు ర
వంత యెఱుంగడు మంచియుం జెడున్

కొడుకును మాటికిందలఁచు
కొంచును దోఁచక కాళ్ళు చేతులున్
ముడుచుక కూరుచుండు నొక
మూలనుఁ దద్వినివృత్తి యొత్తిడిన్
కడుఁగనికందు నాదు పసి
కందు శరీర మెడంద యందు నం
చడలుచు లేచెదన్ దిరిగి
అట్టిటు సూరక ప్రొద్దు నీడ్చెదన్

ననుఁ బడఁడిట్టినన్ మనసు
నన్వ్యధజెందనుగాని నాదుక
న్నని నొక చిన్నమాట అని
నన్ పయిరింపదు నాదు ప్రాణ మెవ్వరే
మనినను వాఁడు నాకుఁబర
మాత్ముఁడు కన్నుల వెల్లు వాని బొ
జ్జనుఁగదలాడు ముజ్జగముఁ
జక్కగ ముద్దులు మూటగట్టుచున్

తలుపులు మూసెదన్ గాడుకు
తానిఁక రాడనుచున్ దలంచుచున్
తలుపులు తీసెదన్ గొడుకు
తాఁజనుదెంచె పటంచు నెంచుచున్
తలుపులు మూఁత తీతలును
దక్క మనస్సునఁ బుత్ర మోహ పుం
దలఁపుల మూఁత తీతలవి
నాకు నసాధ్యములయ్యె నియ్యెడన్

ఉండఁడు నాకడన్ సరిగ
నుండిన కొంచెము సేపుగూడ నా
గుండెలు క్రుమ్మిపెట్టునెట
కో ననుఁ ద్రెంపుకపోవఁ జూచు బ్ర
హ్మాండము జక్కదిద్దుపని
అయ్యది అంతయునున్ నిజైక దో
ర్దండము నందె నిల్చెనొ!
అతండె యితండుగ మొల్చెనో యిటన్

విసిగ్గి మనస్సు బిడ్డపయి
వెట్టివిమోహముఁ కూడదంచు నే
ముసుఁగిడి పండుకొందునొక
మూలను గుట్టుగ వాఁడెచుట్టునున్
మసలుచునున్న యట్టులను
మానముపుట్టి ముసుంగుదీసి నల్
దెసలను జూచెదన్ గళవ
ళించెద మిధ్యగఁ దోఁచి అంతయున్

తాళఁగలేక బిడ్డఁడొక
దారికిరాక విరక్తి నింటికిన్
తాళముపెట్టి యేడక యి
నన్ జనఁ జూచెదఁ గాని వాఁడు త
త్కాళియ గర్వ నిర్హరణ
తాండవ చండుఁడు నాదు గుండెపై
కాలిడి త్రొక్కినట్టులయి
కాళ్లలు సాగక నిల్చిపోయెదన్

వడివడి పారిపోవు పసి
వానిని గట్టిగఁ బట్టుకొంచు వెం
బడిఁబడి చంక కెత్తుకొన
వాఁడట నిల్చున? క్రుమ్మి క్రుమ్మి న
న్నెడపెడ జారి జారుకొను
నిస్పిరో! మాకదుఃఖవార్ధి యం
దుడుగక ఈదులాడు నెవఁ
డో మిగులుం దుది మత్స్యమూర్తిగన్

బుడుతఁడు లేక సెబ్బపయి
బొత్తిగ తోఁచక ప్రక్కదుప్పటుల్
తడుముచుఁ జూచుకొందును దొ
లంగక నాభ్రమ వాని నట్టిటున్
పడపడ దుల్పుకొంచుఁ గను
పట్టని యంత అణూపమ స్వరూ
పుడొ! యని నివ్వెఱన్ మునిఁగి
పోవుచు నుందును వందు చుఁదునున్

డాయఁగ వచ్చినట్లయి త
టాలున వాని గవుంలింపఁగా
బోయిన నేమి యుండదట
ముంగిట శ్యామల వృక్షవాటికా
చ్ఛాయ లితస్తతః పవన
సంచలితంబులు దక్క అక్కటా!
వేయి విధాల వాఁడు భ్రమ
పెట్టుచునుండెను నన్ను తల్లినిన్

ఎదురయి యెత్తుకొమ్మనుచు
నేడ్చును బిడ్డ భుజాంతరస్థమున్
వదలి తటాలునన్ ఘటము
వాఁ పరిపూర్ణము వానిఁ గొగిటన్
బొదివెద, ముక్కచెక్కలయి
పోయినఁబోయెను గాక మృద్ఘటం
బది లభియించె నియ్యది మ
హామృత భాండ మటంచు నెంచెదన్

అమ్మనుగాను నేనెపుడు
నాడుకొనంగను వానికేను కీ
ల్బొమ్మను దీఱుదాఁకఁదన
ముచ్చట లెల్లను నాడి యాడి ఆ
పిమ్మట నూడదీసి అటు
పెట్టును గీలును గీలు నామ రూ
పమ్ములు నాకునుండ
వీఁకఁ వాఁడె పమస్తము నేను లేనిటన్

ఉండినఁజాలు నాకడను
ఒప్పులకుప్పగఁ గృష్ణు డేమి లే
కుండిన నన్నియున్నటులె
యుండును, నాకడ వాఁడు లేడొ! నా
కుండియునన్ని లేనటులె
యుండును ఉన్నది వాఁడొకండె బ్ర
హ్మాండమునందుఁ గన్పడున
వన్నియు లేనివె నాకుఁ జూడఁగన్

ఇమ్ముగ నెమ్మిగాఁబువుల
ఏర్చియుఁ గూర్చియు నల్లుకొన్న మా
ల్యమ్మును బిడ్డఁడొల్లక తొ
లంగఁగ శ్రీహరి యింటి వేల్పు కం
రమ్మున వైచుకొందును ఘ
నాఘన మోహనమూర్తి స్వామి తా
కిమ్మనకుండ నిష్టపడుఁ
గృష్ణుఁడె విష్ణుఁడటంచు పొంగెదన్

అనిశముఁ గృష్ణనామ జప
మయ్యెను లోనను నెంత వద్దు వ
ద్దనుకొనినన్ నిరంతరము
నద్దమునన్ బలె వానిరూపె తో
చును జిఱునామ రూపమయ
సూన జగత్తు వినా అదృశ్యమై
చనెఁ దత నామ రూపమయ
సర్వజగత్తును నాకు నొయ్యనన్

ఎడ పెడఁ దిన్న వెన్నలవి
యించుక చాలక యింక ఏవో! వ
న్నడుగును వాఁడు నాకడను
నయ్యవి లేవనఁ బట్టుబట్టి నా
యొడి విడగుంజు నక్కడను
నుండక ఎయ్యవి మొండి దేలు నా
యెడఁదవి చీల్చిపెట్టవలె
నేమొ వెడల్పుగ వాని ముంగడన్

గిట్టక వానిక్రీడ జళికించుచు
గిన్కగ జూడ గాలువల్
గట్టగ బాష్పముల్ పసిక
రంబులు మోడిచి నాకు దండముల్
వెట్టును వాడు గట్లుతెగి
వెల్లువలై వగ వాని గుండెకున్
గట్టిగ హత్తుకొందుగధ
కంచికి జేరును దీఱు నన్నియున్

వియోగయోగము

వియోగవాల్లభ్యము

(వెన్నెల రాత్రి బృందావనంనుండి మురళీనాదం వినిపిస్తుంది అది విని పరవశించి పరుగులెత్తిన గోపిక అక్కడ వల్లభుడు కానరాక పరితపిస్తూ)

సరిగా నిద్దురపట్టలేదు నిసి ని
శ్శబ్దంబు భంగించుచున్
మొరసెన్ బిల్లనగ్రోవి యేదొ అమృత
మ్ముల్ వెల్లువెత్తెన్ రురుల్
ఝరులై; కూలితినందు నిందొకతుకన్
ప్రాణాలతో దేలితిన్
తరుణిన్ దిక్కెవ రీ యమీతటిని బృ
ందారణ్య మధ్యమ్మునన్
గగనం బంతయు ముంచివైచినను రా
కా జ్యోత్స్న జొంపంబులన్
మిగిలెన్ జీకటులే యమీతటమునన్
వృక్షాళికిన్; సత్సుధా
పగలై వెల్లువలెత్తినన్ మురళిని
స్వానమ్ము లిచ్చోటునన్
మిగిలెన్ నాకు వియోగ హాలహలమే
మేనెల్ల మండించుచున్
మురళిన్ దవ్వుగ గూరుచుండి యెచటో
మ్రోగింపగా నేల? ఒం
టరిగా; పర్వులు వెట్టిపోయి పొదరిం
టన్ దూరగానేల? ద
గ్గరకున్ జేరగ మేము మైమచి రా
గా, గంటిమే ఈ దృశన్
బురుషున్ మాయలుపుట్టి ఆపిదప దా
బుట్టెన్ ప్రపంచంబునన్

ఈ నా నెవ్వగఁ జూచి నవ్వుకొనుచిం
దే యెందొ కాఁదు తీ
రానన్ గుట్టుగ డాగియుండుఁబువుటీ
రానన్ ఘనశ్యామునిన్
వా నిన్ నమ్మగరాదు బైటపడితిన్
రాకాశరత్ జ్యోత్స్న చం
దానన్ వెల్వలఁపోయి నేనెచెడి మి
థ్యా వాగురన్ జిక్కితిన్

పరసత్వంబది వాని సొమ్మట! యిదా
సారస్యమే నిట్టు లం
దఱఁగాదంచు శరన్నిశన్ వలచి రాఁ
దా మోముఁ దప్పించె సి
గ్గరి; నిన్నన్ మలిసంజ ఘర్మసవిల
క్లాంతాస్మదాస్యమ్ము సి
గ్గఱి గోధూళి ముసుంగు నండెటుల ము
ద్దాడెన్ బురీరధ్వలన్

ఇట నవ్వాని పదాంకముల్ చెఱపి పో
యెన్ గాఖి ఆచూకి చి
క్కుట యెట్లింక, రవంత పల్కుడు యమీ
కూలావనీజాత మొ
క్కటియున్ మాఱు; తలూపునూరక ఘమ
త్కారామ్మ! సీత్కారమో!
నటసామ్రాట్టగు వాని శిష్య నట ర
త్నాలేమొ వీరందఱున్

ఈ నా దేహము వానికంటఁ బడరా
దేమో! ప్రతారించుచున్
దా నేగెన్ గనుపింపకుండ మఱి బృ
దారణ్య లోలుండు రే
పైనన్ రాడటొ! యీడకున్ గనఁడటో!
అస్మద్భదాంకంబులన్
వానింగూడను జూచిచూడని పర
బ్రహ్మమ్మొ తా నింతకున్

చినిఁగెన్ గట్టిన వల్వపీలికలు గాఁ
చెట్టుల్ పొదల్ పట్టి ఈ
వని నిచ్చోటకుఁ జేరువేళకు నిసిన్,
వాఁడిందు లేకుండఁ బో
యెను మేలాయెను గానిచో నగుచుఁ దా
నింకేమేమి గావించి యుం
డునొ! నన్, వల్వలదొంగ గుట్టులును మ
ట్టుల్ లేవు పో! వానికిన్

పులకింపన్ జగమెల్ల వాఁడు మురళిన్
మ్రోగించెఁ గూర్చుండి ఈ
శిలచెంతన్ జెలువార నిందనుక ని
స్సీ! మాయమైపోయె నన్
దిలకింపంగనె రాతికంటెఁ జులకై
తిన్ నేను ప్రాణాలుఁ జే
తులుఁ గాళ్లక్షులుఁ గుక్షులుంటయె మహా
దోషమ్మొ ఈ ప్రాణికిన్

తలలో నెమ్మిలిఱిక బాహువులకున్
దారాల తోరాలునున్
మొలలో(జిల్లుల వేణుకాష్ఠమును అ
బ్బో! ఈ మహావేషమున్
దిలకింపంగను(జెల్లె గొల్లతలకున్
వ్రేపల్లెకున్, బట్టణ
మ్ములకున్ బోయిన(బీకిపెట్టరటె! అం
భోజాక్షు లీ పూరుషున్

భళిరా! అజ్ఞత అంగనాహనన గో
పాలున్ బయోభృత్తమున్
పలువన్ గొల్లతలంగనా మదన గో
పాలుండటంచెంచి ని
చ్చలు(గీర్తింతు రెఱుంగ రిప్పిరొ! స్వకే
శాంతప్పముల్ మల్లె పు
వ్వుల కార్చీకటి మోసపున్విసపు న
వ్వుల్ లేశ మాత్రంబునున్

నలుసంతైనను లేదు నిబ్బరము వి
న్నం జాలు వేణుస్వనం
బులు మాత్రేతలు వానికోసమయి ప
ర్వుల్ దీతు రౌరౌర! గు
పులు గుంపుల్వడి యిండ్లు పీడి, అలుసై
పోరా? మఱీ వీరి వె
ఱ్ఱులు చూడంగనె పాని బిఱ్ఱులును మి
ఱ్ఱుల్ చూచునంతంతకున్

బెట్టో ఏమొ! అదృశ్యఁడౌచుఁ దిరుగున్
బృందావనిన్ జెట్టులున్
పుట్టల్ దాటుచు మేమురా భళిర! స్వ
ర్భూలోక పాతాళ స
ఙ్రమాట్టా! ఆతఁడు వాని మేమెఱుఁగమా!
మాఁగోవులన్ మేపఁడా?
బొట్టెండ్రై యెది చూచుకొన్న విభవ
మ్మో! యిద్ది అవ్వానికిన్

తలపైఁ బెట్టిన నెమ్మిపించియపు ని
ద్దా నిగ్గు లొక్కింతయున్
మొలపైఁ గట్టిన పట్టు వల్వ సుషమ
మ్ముల్ కొంతయిన్ వానికిన్
చెలువున్ గూర్చెను గాని వాఁడసలిసీ!
చెప్పంగ సిగ్గౌను మ
బ్బుల కార్నల్లని నైగనిగ్యముల కు
ప్పో! కుప్ప భావింపఁగన్

కాళిందీనది నీటఁ జక్కగను బ్ర
క్షాళించి మత్కజ్జలా
లోలాస్రాస్యముఁబోదు నేను విట కె
ట్లో గుట్టుగా వచ్చి తాఁ
గేళీలోలుఁడొకండె యాడును జల
క్రీడల్ తదంభస్సులన్
మేలో! మేలు! వినీల నీలతనుఁడై
మిన్నంటు వాఁడింకనున్

ఎదొ మోహంపడి వచ్చితిచ్చటకు(గా
నీ యిచ్చటెట్లుండు శా
రద చాంద్రీమయ పౌర్ణమాసినిసి, త
త్కాలవృణ్మహానీల నీ
రద దేహుండు విషాదమేదురతమి
స్కాకాశ మధ్యంబునన్
వెదుకంగా వలెనేమొ గోపికలు వా
నిన్ వారిదశ్యామునిన్

ప్రొద్దా ధూర్తు మొగాననే పొడిచెనా?
భూలోకమంతా యిరుల్
ముద్దా? వాడువినా, గిరాగిర మమున్
బొంగ్రాలుగా(జేసి గా
ద్దెద్దుల్‌గాగను జేసి త్రిప్పికొనునా
యెల్లప్పుడున్ చుట్టు ఈ
షద్దాక్షిణ్యములేని యీ క్రియలు రా
సక్రీడలా చాలికన్

వలపో! కామమొ! మోహమో! బులుపొ! నా
ప్రాణాలు మానాలునున్
జెలువుల్ గట్టితి వాని(గోరి ముడుపుల్
చీమంతయున్ మారు మా
టలు లేవింది(క(గాని కాలునటు పె
ట్టన్ నేను మద్దేహ దే
హళికిన్ వచ్చినవాడె రావలెను లే
వాళ్లె? కానున్ గన్నులున్

ఆలన్ గాచెను వాని వెంటఁ బడి, తా
మై వెంటఁ బడ్డన్ వ్రజ
స్త్రీలన్ గన్గొనఁ డాల నెత్తిపయి మొ
ల్చెన్ గొమ్ము లీ స్త్రీల శీ
ర్ణా లన్ బువ్వలు పూఁచె మెత్తని పువుల్
కా విష్టముల్ వానికిన్
హలప్రాయ విషాణ కోణ ఘన ఘృ
ష్టుల్ కావలెన్ నిత్యమున్

ఇల నిం కెచ్చట నాట సాగ దని వాఁ
డిచ్చోట ఈ గంగి గో
వుల వ్రేపల్లెను బుట్టె నెంతయిను దె
ల్వుల్ పుట్ట పైపెచ్చు చే
తుల యం దొండొక వేణుదండమును ధూ
ర్తుల్ వానినిన్ దానినిన్
దిలకింపంగనె నిష్పుకల్ చెఱఁగు నా
దేహమ్మె సర్వమ్మునున్

తెగె బంధంబులు వాని తోడ నని యెం
తే హాయిగా నుండఁ గ
ప్పుగఁ గప్పెన్ యమునానిలప్రచలితం
బుల్ ముంగురుల్ వ్రేలుచున్
మొగమున్ గన్నులుఁ గూడ నింటికి నసుం
బోకుండ వెంటాడుచున్
బగపట్టెన్ గట! తత్తనుచ్ఛవులు కు
ప్యత్కాలపర్ణచ్ఛటల్

చినచిన్నప్పుడె వాని చేసిన పనుల్
చిత్రమ్ము లొక్కమ్మ పా
లును ప్రాణమ్ములు గ్రోలె నో రైబచి ము
ల్లోకమ్ములన్ జూపె గ్ర
న్నన నొక్కమ్మకు వాడనన్ భయ మగున్ నా
కున్ మఱీ స్త్రీల మో
లనె చూపించుచు నుండు వాడు తన లీ
లల్ చాకచక్యమ్ములున్

తలలో మల్లెలు పండు వెన్నెలను బృం
దామృత్తికన్ దేహమున్
వలపుంజీకటి క్రమ్ముకొన్న మది స
ర్వంబున్ యమినిమ్మగన్
గలయన్ నే వసు స్త్రీయె లేని తఱి నే
కచ్ఛత్రవాల్లభ్యమున్
వెలిగింపంగను వచ్చు నేమొ మఱి గో
పీలోలు డిచ్చోటకున్

ప్రతిబింబంబును జూచి ఆడు కొనగా
బాపాయినా నేను మ
న్మతి నెల్లప్పుడు వాడె తోచు నిజవిం
బప్పర్శముల్ లేని ఈ
బ్రతు కెదా కిక నెండమావుల జలాల్
వా తృష్ణలన్ దీర్చునా?
అత డొక్కించుక నన్ను నంటివను అం
త్రై పోవునా? అంతగన్

చిఱునవ్వుల్ శిఖిపింఛముల్ జిలుఁగు కౌ
శేయమ్ములున్ జూచి బం
గరు పాత్రంబు పయఃప్రపూర్ణ మనుచున్
గాంక్షించుచున్ నెత్తిపై
ధరియింపన్ దొరకొంటి గోపికను స్వాం
తంబందు నవ్వాని దు
ర్భరహాలాహలపూర్ణకుంభ మని సం
భావింప లే దెన్నఁడున్

కాళిందీనది నీటి గల్గలలు రా
కాచంద్రమశ్చంద్రికా
హేలాచ్ఛాంబుల నవ్వులున్ బకపకల్
బృందావనీ వృక్షప
ర్ణాలన్ దూరిన గాలి ఆ గుసగసల్
నన్ జూచి కాఁబో విసీ!
వేళాకోళము క్రిందకున్ దుదకు దిం
పెన్ వాఁడు నా జన్మమున్

మను మోహంబులు పుట్టి పుట్టిరొ మతే
మో! కామినుల్ లేచి పో
వునొ! ప్రాణంబులు గాజు లండెలును సొ
మ్మల్ లేక నా కీనిశీ
ధినిఁ దన్నిక్వణ మాలకించి మనుముం
దే పోయి యెందెందొ దూ
రెను లేకున్నను జిక్కి పోవఁ డటె ఈ
రే వాఁడు నా చేతికిన్

అతఁడేమో! ఒక వెల్గుపుట్ట జలద
శ్యాముండు నేనో తటి
ల్లతికన్ నీడను; సంచరించవలె నీ
రాకానిశీధమ్ములన్
గతి లే నట్లుగ వాని వెంటఁబడి బృం
దావీధులన్ వాఁడు నా
బ్రతుకున్ వాపురె! తారుమారుగ నొన
ర్పన్ జూచె నీ రీతిగన్

తా నే మైనను రామచంద్రుఁడొ యిటన్
దద్దివ్యసౌందర్యమున్
నే నే మైనను రక్కి పీఁకి తినమున్
ద్రేన్చంగమున్ రాక్షస
స్త్రీనో! మైమఱపించి పిల్చుకొని ముం
చెన్ వాఁడు నన్నిట్లు క
ట్టా! నట్టేటను ముగ్ధగోపికను బృం
దారణ్య మధ్యంబునన్

పుట్టించెన్, దగ హాయిగా సుఖముగాఁ
బొల్పారు నా లోపలన్
నిట్టూర్పుల్ మఱి కారుచిచ్చులునుఁ గ
న్నీ రా పయిన్ వట్టి ఈ
మట్టిన్; వానిని నించుకంతయును న
మ్మన్ రాదు గుండ్రాతికిన్
జుట్టున్ గాళ్లలు వ్రేళ్ల గోళ్లు మొలిపిం
చున్ గూర్చు పంచత్వమున్

జలదశ్యామునిఁ సంస్మరించుచును అ
స్మత్స్వాంతమున్ ధ్వాంతపి
చ్ఛిలమై పోయెను వానికై యెదురు చూ
చీ చూచి నైరాశ్యవి
హ్వలముల్ కన్నులు మిన్ను లయ్యెఁ గడ కే
మై పోదునో నేను ముం
గలఁ దద్రూపమె తోఁచి నంతఁ దగ విం
ఁన్ వాని సాంగత్యముల్

అవురా! నమ్మఁడు గాని వాఁడు ననుఁ గా
నా? నేను సొంపైన వే
ణువు మో విచ్చుకొనంగ మోహపడి, కా
నో? నేను నింపైన వే
ణువు మోవించుకొనంగ మోజుపడి అ
నోర్వాయియున్ లేని వే
ణువు నిర్జీవపు వేణు వేల? ప్రమదా
ర్ణోరాశి నోలాడగన్

చెఱ లోలో నవతార మెత్తెను, నిసిన్
జేరెన్ యశోదమ్మ మం
దిరమున్ మాయముచేసి తచ్ఛిశువుఁ బొ
త్తిళ్ళందుఁ దా దూరెఁ బా
ల్పెరుగుల్ దోఁచెను వ్రేత లిండ్లఁ బడి ఈ
రీతిన్ దుదిన్ మా మదిన్
హరియించెన్ భళి! ఏమి చెప్పవలె నిం
కా యయ్య భాగోతముల్

ఒకతన్ జాలనా! నేను కావలయు నే
మో! గోపికల్ రాసకే
ళికి వేల్వేలుగ నంత మంద యిచటన్
లే కీ అజాండాల నొం
డొక పక్షిన్ బలె గుట్టుగాఁ బొదుగ ను
ద్యోగించెనో! వాఁడు పు
ట్టుక వచ్చున్ తెగ ఆడ పక్షు లిఁక గ్రు
డ్డుల్ చిట్టి కోకొల్లగన్

కన్నుల్ చాలవా! ఉన్న రెం డవియె ల
క్షల్ వేలవేల్వేల పె
ట్టిన్ననా! యిఁక నెమ్మి కన్నులను నే
లా? వానికిన్ నెత్తిపై
అన్నుల్ గుట్టుగ గుట్టుగా బ్రతుకు బె
ట్టంతర్మనఃపేటికా
చ్ఛన్నమ్ముల్ గని పెట్టి దోఁచు కొనె నా
సర్వస్వమున్ వాఁడిటన్

నా యీ గుండెను చీమ దూరని విధా
నన్ మూసినన్ గూడ నె
ట్లో యే క్రంతనొ దూరి లోపలను గూ
ర్చుండున్ బలే తీవిగాఁ
ద్రోయంబూనిన బైటకుం గదలఁడే
దో సొంతమై పోయె వం
తా యే రీతి భరింపఁగా వలె నిఁకన్
దద్ధూర్తపుమూర్తినిన్

ఎన్నన్ గోవులు పూజనీయములు మా
కెంతేనిఁ దద్భావనా
ప్రోన్నిద్రాంతరవాసనాచయ బల
మ్మో! ఏమొ! తద్గోచర
క్షుణ్ణక్షీతలధూళిధూసరిత త
ద్గోపాలు నాస్యమ్ము గూ
డ న్నా కగుపించు నందముగఁ గ
ట్టా! యెంత కా దన్నసున్

గోష్ఠాల్ గోవులుఁ గుంజపుంజములు వా
గుల్ వంక లిష్టాలు బృం
దిష్టాల్ వానికి మావురేపులును వా
నింగోరి వెన్నాడు బిం
బోష్ఠుల్ గిట్టరు వాఁడు లేక గతి లే
దో? చాలు తద్గోపరా
డ్గోష్ఠుల్ చాలును చేము నెత్తురులు మా
కుం జావ లే దింకనున్

మలపుల్ మీఱఁగ వేణు వూదుచు నసా
మాన్యమ్ముగా నిల్చు ఆ
పొలుపుల్ వేఱు త్రివక్రవిక్రముఁడు మ
మ్మం బట్టి పాలార్పఁగా
వెలసెన్ వాఁడు త్రివిక్రమక్రముఁ డిసీ!
విద్రోహికిన్ వానికిన్
బలులై పోయిరి చిక్క రిప్పు డబలల్
బాష్పాకులల్ గోపికల్

ఇటకున్ వచ్చెడి వేళ నా తనువు బ
ర్వే లే దెదో పర్వతం
బటులై పోయెన దిప్డు కా ల్కదప లే
నైతిన్ రవంతైన ని
ల్లెటు సేరన్ వలె దిక్కుమొక్కును నతం
డే ఏమొ! నా కింక ఆ
నట గోవర్ధనధారి, సైచు టెటు? త
న్నిక్కార ధిక్కారముల్

నఖరాగ్రమ్మున తోచి తోచ కెదియై
నన్ గీసినన్ నేలపై
శిఖిపింఛంబు లు పద్మపత్రము లు న
క్షిద్వంద్వమై వాని శ్రీ
ముఖమై పోవు నదేము చిత్రమొ! అదే ము
మ్మూర్తులన్ నాకు శ్రీ
ముఖ మయ్యెన్ పొడిపించె నాకనులు పో
పో! వాడు నాచేతులన్

ఎది యెట్లైనను వాని బృంద యిది వా
డిచ్చోటకున్ రాక త
ప్పదు, నే నేగిన మత్కపోష్ణనయనాం
భఃక్లిన్న మీ మట్టి పో
దది తత్పాదము లంటి తీరు దుడువన్
యత్నించినన్ గూడ బో
దది తత్పాణివి బట్టి తీరును వృధా
అయాసముల్ వానికిన్

రాకాజ్యోత్స్నలు వాని చిర్నగవు లె
ల్లన్ ప్రొంగెఁ దన్నీలమే
ఘాకారంబును గుంజపుంజముల చీ
కట్లారగించెన్ మఱీ
లోకంపుంగఱు వంత వచ్చి యిచటే
ప్రొద్దైన యట్లుండె మా
దాఁకన్ రాఁడఁక నూరు పేరులును ప
త్తా లుండవున్ వానికిన్

మొలకెత్తించెను, బెంచె రాగలతికల్
పూయించెఁబూల్ కుప్పతె
ప్పలుగా నా యెదతోట లోనఁ దుద కు
త్పాటించి పెట్టించె బ్రో
గులు వాఁ డిచ్చట నింత కర్కశుఁడటో!
గోపాలుఁ డా తిన్న వె
న్నలు నే మయ్యెను లేదు మార్దవము చి
న్నం చింతయున్ వానికిన్

వాఁడే దేవుఁడ? మంచి చెడ్డలను సం
భావించి పాలింపఁగా
లేడా? యొక్కఁడు వాని కంటెను బయిన్
రేయిం బవళ్లిట్టు ల
ల్లాడింపం బని యేమి? గాలులకు ని
ట్ట ట్టూఁగగా మేము త
చ్చూడాబర్వపు టీఁక జోకలమ! న
చ్చుల్ గూడ విచ్చో నిఁకన్

కచభారమ్ము నితంబభార మటుపై
గన్నిటి భారమ్మునున్
గుచభారమ్మును నిన్ని భారములతో
గొండంత ఆసన్ గృహా
ప్రచయమ్మున్ విడి రా మటిన్ని భరముల్
నా నెత్తిపై మోపి వా
డు చనెన్ దేసికి నంటకుండ గసి పు
ట్టున్ వావి ఊ సెత్తినన్

వా డే నయ్యెనొ నేను వా డయితినో
వాడీ నను ం జూచి సి
గ్గై డాగెన్ బొదరిండ్లు దూరి భళిరా!
అందాల కృష్ణమ్మ కై
ఈడాడన్ వెదుకాడి పట్టుకొని నే
నే తాను వద్దన్న ము
ద్దాడన్ వలె నేమొ మీ దబడి మో
హావేశ ముప్పొంగగన్

కనులున్ వీనులె కాదు చక్కగ హృషీ
కగ్రామమున్ సర్వమున్
దన కర్పించితి నిట్టి నా పయిని ని
ర్దాక్షిణ్యమా? యింత! కా
రిన దుఃఖాభ్రపయః కణప్రతతి బో
లెన్ వానినిన్ దవ్వుగన్
కొనగోటన్ విదలించి పైతు నిక నా
కున్ దేని కీ మోహముల్

తా నేమో తన నెమ్మిపించియపు టం
దా లేమొ గానీ రవం
త్రైనన్ బట్టవు మాదు ముంగురుల లా
స్యాల్ పట్ట మీ మేమునున్
లేనేలేదటొ తాను దక్క. యిచటన్
లేశమ్ము వే తొద్దియున్
నానారూప బృహత్ప్రపంచ మిది అం
తా గుల్లటో! కల్లటో!

రారా! రార! యటన్న రాక చను దూ
రం బౌచు నంతంతకున్
పోరా! పోర! యటన్న పోక నికట
మ్ముం జేరు నంతంతకున్
శ్రీరామా! యిక నేమి చెప్పవలె ఆ
చిన్నారి చెయ్యిమ్ము లా
భీరస్త్రైణము చంక కెత్తుకొని చుం
బింపన్ వలెన్ వానినిన్

ఇచ్చల్ నిచ్చలు రేపి మంట లిడి వా
డేగెన్ మదిన్ పుట్టవో
కచ్చెల్ మాకును ఊరకుండుమొ! మహో
గ్రవ్యాళమై నేను న
న్నచ్చ మిచ్చట వాడు బొమ్మగను నె
ట్లూడించె నట్లూతనిన్
మచ్ఛీర్షస్ఫట మీద చుమ్మలును సొ
మ్మల్వోవ నాడించెదన్

మోజుల్ సర్వము(దీటి పోయినవి పో
పో! నే(టితో నింక నా
కీ జంజాటపు సొమ్ము లేమిటికి నిం
దే వైచి నే నేగెదన్
బూజుల్ పట్ట(గ(బట్ట(గా అవియె ఎ
ట్టో వా(డు రా తత్పదాం
భోజస్పృష్టికి ఘుల్లునన్ మొఱసి చె
ప్పున్ బుద్ధి చీ కొట్టుచున్